క్లుప్తంగా

'సీఎం బ్రేక్ ఫాస్ట్' ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు.

అభివృద్ధిపై చర్చకు రావాలి

దౌల్తాబాద్(దుబ్బాక): దొమ్మాటలో జరిగిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు చర్చకు వస్తే సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ కొమ్మెర పూజిత పేర్కొన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఉపసర్పంచ్ సింహాచలంతో కలిసి మాట్లాడారు. గురువారం దొమ్మాట ఎన్నికల ప్రచారంలో రఘునందన్‌రావు సర్పంచ్‌కు అభివృద్ధి పనుల కోసం చాలాసార్లు ఫోన్ చేస్తే స్పందించలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దొమ్మా టలో ఏ పనులు చేశామో గ్రామస్తులకు తెలుసన్నారు. దొమ్మాట అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నిజాలు నిరుపించుకోవడానికి ఎమ్మెల్యే చర్చకు రావాలని సవాల్ విసరారు.

'బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి'

అక్కన్నపేట(హుస్నాబాద్): బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గుగులోతు వీరన్ననాయక్ పిలుపునిచ్చారు. అక్కన్నపేట మండలం ముసమ్మవాగుతండా పంచాయతీ పరిధిలోని మబ్బుకుంట తండాలో ఆయన మాట్లాడారు. గిరిజన తండాల్లో నేటికీ ఇళ్లు లేని గిరిజనులెందరో ఉన్నారని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని వాపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గిరిజన నాయకులు ధరావత్ తిరుపతినాయక్, భూక్య రమేష్, తిరుపతి, గుగులోతు రాజు, గుగులోతు అర్జున్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రంలోని పరిసరాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో జరిగింది. భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగరగల్ల దినేష్(33) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 4వ తేదీన మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడి రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అదే రాత్రి వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న దినేష్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. తున్కిఖాల్సాకు చెందిన కోనాయిపల్లి బాబు, కొండగల్ల మహేష్(35) బుధవారం బైక్‌పై వర్గల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా శాకారం సమీపంలోని డూపాంట్ పరిశ్రమ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన ఇద్దరిని లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను వైద్యుల సూచన మేరకు గాంధీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఏడాది క్రితం వివాహమైంది.

హరీశ్‌రావుతోనే అభివృద్ధి

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు ప్రతిపక్షాలతో పోటీ లేదని, మెజార్టీ విషయంలో ప్రజలకు, బీఆర్‌ఎస్‌కు మధ్యనే పోటీ ఉందని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ సిద్దిపేట అభ్యర్థి హరీశ్‌రావుకు మద్దతుగా నాయకులు శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని మందపల్లి, ఎల్లుపల్లి, మిట్టపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సిద్దిపేట మరింత అభివృద్ధి సాధించాలంటే మంత్రి హరీశ్‌రావుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సవితా ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్‌లు కొమ్ము రాజయ్య, వంగ లక్ష్మి, జయశ్రీ రమేష్, వైస్ ఎంపీపీ ఎల్లం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి



మట్టి ప్రమిదలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

హుస్నాబాద్: 'స్వచ్ఛ దీపావళి.. శుభ్ దీపావళి' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి దీపాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. దీపావళిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. వాతావరణ కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని పేర్కొన్నారు. రసాయనాలతో తయారు చేసిన దీపాలు కాకుండా మట్టితో తయారు చేసిన వాటిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాలం ఎల్లం, ఏఈ సాయి ప్రణీత్, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, మెప్మా సీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



సభాస్థలిని పరిశీలిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 18న చేర్యాలలో నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ తదితర ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని స్థానిక నాయకులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్ నర్సయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, నాయకులు చందు, హరి, అంజయ్య, కొండయ్య, సిద్దిరాములు, బాబు, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు

సిద్దిపేటకమాన్: ఇన్నోవేటివ్ థింగ్స్ వర్క్‌షాప్ ద్వారా నర్సింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీమేరీ, ప్రొఫెసర్ డాక్టర్ షీబా అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం రోజూ వినియోగించే వస్తువుల ద్వారా ఎలాంటి వైద్యం అందించవచ్చు అనే అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, రాజమణి, సిబ్బంది భవాని, సుప్రియ, మంజుల, శైలజ, చైతన్య, అరుణ, భావన, సురేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు ఇప్పటి నుంచే ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేర్యాల మండలంలోని కమలాయపల్లి, అర్జున్‌పట్ల, దూల్మిట్ట మండలంలోని కూటిగల్‌లో ఎన్నికల ప్రచార కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణానికి చెందిన బోనాల నర్సింలు శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ విక్టరీ చౌరస్తాలో తన పర్సును పోగొట్టుకున్నాడు. అదే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సొడమ్ గోపాల్ పర్సును గుర్తించి అందులో ఉన్న ఆటో ఆర్‌సీలో వాహన నంబర్ ద్వారా అతడి అడ్రస్, ఫోన్ నంబర్ గుర్తించి బాధితుడికి పర్సును, అందులో ఉన్న రూ. 2,060, విలువైన పత్రాలు అప్పగించాడు.

మా మద్దతు హరీశ్‌రావుకే..

సిద్దిపేటజోన్: హరీశ్‌రావుకు ఎన్నికల్లో అండగా ఉంటామని టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం ఏకగ్రీవ తీర్మాన పత్రాలను మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డికి అందించారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు



కొమురవెల్లి మండలం కిష్టంపేటలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పల్లా

- కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టంపేట, రాంసాగర్, గౌరాయపల్లి, మర్రిముచ్చాల, లెనిన్‌నగర్, కొమురవెల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదని.. వారికి అధికారమిస్తే సంక్షేమ పథకాలన్నీ బంద్ అవుతాయన్నారు. సంక్షేమంలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని తెలిపారు. జనగామ నియోజకవర్గాన్ని గజ్వేల్, సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు కరెంట్ కష్టాలు తప్పవన్నారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 60 కోట్ల నిధులు తెచ్చానని, అందులో రూ. 25 కోట్లు గ్రామాల అభివృద్ధికి కేటాయించానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థికి బీఆర్‌ఎస్ అన్ని అవకాశాలు ఇచ్చిందని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఊసరవెల్లిలా పార్టీలు మారుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడని విమర్శించారు. ఈప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులను ఈనెల 18న చేర్యాలలో జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ చేత మంజూరు చేయించుకుందామన్నారు. ఆశీర్వదించి ఓటు వేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన వివిధ సుమారు 350 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, జెడ్పీటీసీ సిద్దప్ప, ఎంపీపీ కీర్తన, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, వంగ చంద్రారెడ్డి, పచ్చిమద్ల స్వామి, కరుణాకర్, పద్మ, కృష్ణారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

కొమురవెల్లి పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తా..

కొమురవెల్లి పీహెచ్‌సీని సొంత ఖర్చులతో అప్‌గ్రేడ్ చేస్తానని జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామస్తులు పీహెచ్‌సీకి అంబులెన్స్ కావాలని కోరారు. ఒకవేళ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తే హైదరాబాద్‌లోని తన ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి

జనగామ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పిస్తున్న కేసీఆర్‌ను మూడో సారి సీఎం చేసేందుకు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ అన్నారు. పట్టణంలోని 15వ వార్డుతో పాటు అయా కాలనీల్లో శుక్రవారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. వార్డు, పార్టీ మహిళలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజలు దీవించి గెలిపిస్తే జనగామను మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. కాగా, వార్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. 20వ వార్డులో కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఆర్.రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్ మారబోయిన పాండు, ఎండీ మాజీద్, వార్డు అధ్యక్షుడు ఆలేటి రాజు, సాయి చరణ్‌రెడ్డి, లాజర్, యాదగిరి, రాము, మల్లేష్, సాయిరెడ్డి పాల్గొన్నారు.



జనగామ: 15వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా సతీమణి నీలిమ



జనగామ: 20వ వార్డులో ప్రచారం చేస్తున్న నాయకులు

త్వరగా కొనుగోళ్లు చేపట్టండి

హుస్నాబాద్‌రూరల్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచడంతో పాటు డబ్బులు త్వరగా రైతుల ఖాతాలకు చేరేలా కృషి చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ పేర్కొన్నారు. శుక్రవారం పోతారం(ఎస్) ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా సమస్యలపై ఆరా తీశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాస్, సీసీలు ఉన్నారు.

కేసీఆర్‌కే మా మద్దతు

గజ్వేల్: గజ్వేల్ నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌కు వివిధ వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతుంది. శుక్రవారం గజ్వేల్ ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈమేరకు శుక్రవారం ఆ తీర్మాన కాపీని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

జగదేవ్‌పూర్(గజ్వేల్): వివాహేతర సంబంధం యువకుడి హత్యకు దారితీసింది. మండలపరిధిలోని తీగుల్‌కు చెందిన ఉపేందర్(29) ఇదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. విషయం సదరు మహిళ భర్తకు తెలియడంతో గతంలో నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడిపై కేసు పెట్టారు. దీంతో కొంతకాలం దూరంగా ఉన్నాడు. నెల రోజులుగా తరచూ ఫోన్, మెసేజ్‌లు రావడాన్ని గమనించిన మహిళ భర్త నాగరాజు ఎలాగైనా ఉపేందర్ అడ్డు తొలగించాలని భార్యతో కలిసి ప్రణాళిక రూపొందించాడు. ఈక్రమంలో గతనెల 30వ తేదీన ఉపేందర్‌కు ఫోన్ చేసి హైదరాబాద్‌లో వారు నివాసముండే ఇంటికి పిలిపించారు. అక్కడ సదరు మహిళ, తల్లి, భర్త కలిసి చితకబాది విషపదార్థాలు కలిపిన కూల్‌డ్రింక్‌ను బలవంతంగా తాగించారు. అక్కడి నుంచి వెళ్లిన యువకుడు మరుసటి రోజు వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అక్కడి నుంచి గురువారం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఉపేందర్ ఆస్పత్రిలో ఉండగానే ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాధిత కుటుంబీకులు శుక్రవారం రాత్రి మృతదేహాన్ని నిందితుడు నాగరాజు ఇంటి ఎదుట వేసి ఆందోళనకు దిగారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.



ఉపేందర్(ఫైల్)

సంక్షిప్త వార్తలు

◆ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలోని గోవర్ధనగిరి, వర్ధరాజుపల్లి, ఘనపురం, బంజేరుపల్లి, తుక్కాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం మగ్దూం అలీ మట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు నవీన్‌కుమార్, దేవేందర్, ఆయా గ్రామాల రైతులు, పంచాయతీ కార్యదర్శులు, సీఏలు పాల్గొన్నారు.

◆ విశ్వరూప మహాసభకు తరలిరండి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ కోరుతూ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు మాదిగ ఉపకులాలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్నకోడూరుతో పాటు రామునిపట్ల, గోనెపల్లి, ఇబ్రహీంనగర్‌లో ప్రచారం నిర్వహించారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 3వ వార్డుకు చెందిన పలువురు యువకులు శుక్రవారం మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు రాకేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

◆ బీఎస్పీతోనే సామాజిక న్యాయం

సిద్దిపేటకమాన్: నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేసేదే కేవలం బీఎస్పీ మాత్రమేనని ఆ పార్టీ సిద్దిపేట అభ్యర్థి చక్రధర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటలో జరగనున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీఎస్పీ మధ్యే పోటీ ఉంటుందన్నారు. సిద్దిపేటలో కౌన్సిలర్‌గా కూడా గెలవలేని వ్యక్తికి బీజేపీ టికెట్ ఇచ్చిందని విమర్శించారు. సమావేశంలో వెంకట్, అశోక్, మోహన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్ నాయకుల పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి హరీశ్‌రావు లక్షన్నర మెజారిటీ సాధించాలని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంతోషి మాత, రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ అన్నివర్గాలకు సంక్షేమం

సిద్దిపేటరూరల్: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ, గ్రామాలను అభివృద్ధి చేయడం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎంపీపీ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్‌లో మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, సర్పంచ్ పర్శరాములు, రైతుబంధు సమితి అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

◆ నంగునూరును ఆదర్శంగా నిలుపుదాం

నంగునూరు(సిద్దిపేట): అన్ని వేళలా అందుబాటులో ఉండి ఆపదలో అండగా నిలిచే హరీశ్‌రావు రికార్డు మెజార్టీ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, మల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, సోమిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అక్కేనపల్లి, ఆరెపల్లి, ఘణపూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసి నంగునూరును ఆదర్శంగా నిలపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, కృష్ణారెడ్డి, నాగేంద్రం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

◆ ఓటు వజ్రాయుధం

సిద్దిపేటఅర్బన్: ఈనెల 30న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం సాయంత్రం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల, కిష్టసాగర్ ,తడకపల్లి, ఎన్సాన్‌పల్లి గ్రామాల్లో త్రీ టౌన్ సీఐ భాను ప్రకాష్, ఎస్సై మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

◆ పరామర్శ

కొండపాక(గజ్వేల్): సీఎం కేసీఆర్ నామినేషన్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏర్పుల నర్సింలు, గజ్జె నర్సింలును శుక్రవారం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పరామర్శించారు. రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మంత్రి హరీశ్‌రావు సైతం రూ. 10 వేలు నాయకుల ద్వారా అందజేశారు.

◆ కాంగ్రెస్ నాయకులపై దాడి సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులపై దాడులు సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు రక్షణ కల్పించడం మాని బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పోలీసులు వ్యవహరించడం బాధాకరమన్నారు.

◆ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడిందని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, పీఏసీఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను కోరుకుంటున్న ప్రజలు



జనగామలో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో కొమ్మూరి

- బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం
- ఆరు గ్యారంటీ స్కీంలతో ఆర్థిక భరోసా
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి

జనగామ: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని పార్టీ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంతో పాటు 16, 12వ వార్డుల్లో చేరికలు, ప్రచార కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో మా టలు తప్ప, చేతల్లో ఏమీ జరగలేదన్నారు. ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక నిరుద్యోగులు, యువకులు రోడ్డున పడ్డారని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడంలో సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యం, అలసత్వంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, ఈ పాపం ఊరికే పోదన్నారు. దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం, ప్రజలకు మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీసిందే తప్ప, ఏ ఒక్కరికి న్యాయం చేయలేదని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను గుర్తించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మిగులు బడ్జెట్‌తో ప్రత్యేక రాష్ట్రం ఇస్తే, కేసీఆర్ సర్కారు అప్పుల కుప్పగా మార్చేసిందన్నారు.

అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా..

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు పెరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో కాంగ్రెస్ ప్రచారానికి ప్రజల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అధికారంలోకి రాగానే ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

పట్టణంలోని 16వ వార్డుకు చెందిన బీజేపీ మాజీ కౌన్సిలర్ కడకంచి మల్లమ్మ, కడకంచి రమేష్ ఆధ్వర్యంలో వందలాది మంది కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రజా పరిపాలన అందిస్తామనే పూర్తి విశ్వాసంతో అనేక మంది స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మేడ శ్రీనివాస్, గాదెపాక రామచందర్, మిద్దపాక స్టాలిన్, శ్యాం, మిద్దపాక ప్రసాద్, తిప్పారపు అనిల్, నాగిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న కొమ్మూరి కూతురు, మహిళలు



కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీజేపీ మాజీ కౌన్సిలర్ మల్లమ్మ

ఇంటింటి ప్రచారం..

12వ వార్డు వీవర్స్‌కాలనీలో మహిళా నాయకురాలు శ్రీరాం సంధ్యారాణి, అభ్యర్థి కూతురు సాయి ప్రియాంకరెడ్డి ఆధ్వర్యంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గెలుపునకు ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, మున్సిపల్ కౌన్సిలర్ వంగాల కల్యాణి, కొడం అన్నపూర్ణ, మునిబేగం, కూకట్ల సుజాత, రచ్చ రమ, కాముని స్వప్న, ఎనగందుల అన్నపూర్ణ, కొడం నీలిమ తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాల కార్డులను ఓటర్లకు అందించి చేతి గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు.